# హైదరాబాద్‌లో ఆరాజెన్ యూనిట్

## రూ. 25 కోట్లతో ఏర్పాటు చేసిన సంస్థ

హైదరాబాద్, అక్టోబర్ 21: ఫార్మా, బయోటెక్నాలజీ కాంట్రాక్ట్ రీసెర్చ్, డెవలప్‌మెంట్, తయారీ సంస్థ ఆరాజెన్ లైఫ్ సైన్సెస్..హైదరాబాద్‌లో ఫార్ములేషన్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించింది. 3 మిలియన్ డాలర్లు (రూ. 25 కోట్లకు పైగా) పెట్టుబడితో 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మల్లాపూర్ క్యాంపస్‌లో నెలకొల్పింది. క్లినికల్ తయారీ విభాగాన్ని మరింత ప్రోత్సహించడంలో భాగంగానే నెలకొల్పిన ఈ యూనిట్‌లో వివిధ మోతాదుల్లో క్లినికల్ సప్లైస్ తయారు చేస్తున్నట్టు కంపెనీ సీఈవో మన్ని కంటిపూడి తెలిపారు. పలు ఫార్మా సంస్థలకు సంబంధించిన ఓరల్ సాలిడ్స్, లిక్విడ్స్, టాపికల్స్, అన్ని రకాల క్లినికల్ సప్లైస్ ఈ యూనిట్‌లో తయారు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం సంస్థ ట్యాబ్లెట్లు, క్యాప్స లస్, లిక్విడ్ ఫేస్ 1–3 పరిశోధనలను నిర్వహిస్తున్నది. ఈ యూనిట్‌కు ఇప్పటికే దేశీయ రెగ్యులేటరీ అథార్టీతోపాటు సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీవో), డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అనుమతి ఇచ్చినట్లు ఆయన చెప్పారు. వెయ్యి నుంచి లక్ష డోస్‌లు సాలిడ్ ఓరల్స్, 100 లీటర్ల లిక్విడ్స్ తయారు చేసే సామర్థ్యం కలిగిన ఈ యూనిట్‌లో 60 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. తొలి దశలో క్లినికల్ ఉత్పత్తులకు ఈ యూనిట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. 2018లోనే సంస్థ ఇక్కడ ఆర్ అండ్ డీ సేవలను ప్రారంభించిన విషయం తెలిసిందే.




### జోరుగా ఆన్‌లైన్ సేల్స్

న్యూఢిల్లీ, అక్టోబర్ 21: ఈ–కామర్స్ కంపెనీలకు ఈ పండుగ సీజన్ కలిసొచ్చింది. దసరా సందర్భంగా తెచ్చిన ఆన్‌లైన్ సేల్స్‌లో.. తొలి వారం దాదాపు రూ.47,000 కోట్లుగా అమ్మకాలు నమోదయ్యాయి. ఈ మేరకు మార్కెట్ రిసెర్చ్ సంస్థ రెడ్‌సీర్ స్ట్రాటజీ కన్సల్టెంట్స్ తెలిపింది. నిరుడుతో పోల్చితే ఈసారి సుమారు 19 శాతం వృద్ధి కనిపించినట్టు పేర్కొన్నది. ఒక్క ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ విక్రయాలే ఇంచుమించు 63 శాతం పెరిగినట్టు చెప్తున్నది. దీంతో మొత్తం అమ్మకాల్లో రూ.29,610 కోట్ల వాటా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ నుంచి ఫ్లిప్‌కార్ట్, మింత్రా, షాప్సీల్లో అమ్మకాలు నడుస్తున్న విషయం తెలిసిందే.

# కొటక్ బ్యాంక్ హెడ్‌గా అశోక్ వాస్వానీ

## ఆమోదం తెలిపిన రిజర్వ్ బ్యాంక్



న్యూఢిల్లీ, అక్టోబర్ 21: కొటక్ మహీంద్రా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి(ఎండీ, సీఈవో)గా అశోక్ వాస్వానీ నియమితులయ్యారు. మూడేండ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ నియామకానికి రిజర్వ్‌బ్యాంక్ ఆమోదం తెలిపింది. అంతర్జాతీయ బ్యాంకింగ్ దిగ్గజం బార్‌క్లేస్‌లో ఉన్నతాధికారిగా విధులు నిర్వహించిన వాస్వానీ..ఉదయ్ కొటక్ స్థానాన్ని భర్తీ చేయనున్నారు. ప్రస్తుతం వాస్వానీ అమెరికా–ఇజ్రాయిల్ ఫిన్‌టెక్ సంస్థ పాగయ టెక్నాలజీ ప్రెసిడెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

**క్యూ2 లాభం 3,191 కోట్లు**

గత త్రైమాసికానికిగాను రూ.3,191 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని గడించింది బ్యాంక్. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2,581 కోట్లతో పోలిస్తే 24 శాతం అధికం. బ్యాంక్ రూ.13,507 కోట్ల ఆదాయాన్ని గడించింది. సమీక్షకాలంలో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 2.08 శాతం నుంచి 1.72 శాతానికి తగ్గగా, నికర ఎన్‌పీఏ 0.55 శాతం నుంచి 0.37 శాతానికి దిగొచ్చింది.

# ఐసీఐసీఐ బ్యాంక్ ఆకర్షణీయం

**క్యూ2లో 10,261 కోట్ల లాభం**




న్యూఢిల్లీ, అక్టోబర్ 21: ప్రైవేట్ రంగ ఆర్థిక సేవల సంస్థ ఐసీఐసీఐ బ్యాంక్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.10,261 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని గడించింది. వడ్డీల మీద వచ్చే ఆదాయం పెరగడంతో లాభాల్లో 36 శాతం వృద్ధి నమోదైందని పేర్కొంది. క్రితం ఏడాది ఇదే కాలానికిగాను బ్యాంక్ రూ.7,558 కోట్ల లాభాన్ని గడించింది. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.31,088 కోట్ల నుంచి రూ.40,697 కోట్లకు చేరుకున్నట్టు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. దీంట్లో వడ్డీల మీద వచ్చే ఆదాయం రూ.26,033 కోట్ల నుంచి రూ.34,920 కోట్లకు చేరుకోవడం వల్లనే లాభాల్లో భారీ వృద్ధి నమోదైందని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి.

- నికర వడ్డీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 24 శాతం ఎగబాకి రూ.14,787 కోట్ల నుంచి రూ.18,308 కోట్లకు చేరుకున్నది.
- వడ్డీ మార్జిన్ 4.31 శాతం నుంచి 4.53 శాతానికి చేరుకున్నది.
- ఏడాది క్రితం 2.76 శాతంగా ఉన్న బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ గత త్రైమాసికంలో 2.48 శాతానికి తగ్గాయి.
- నికర ఎన్‌పీఏ కూడా 0.61 శాతం నుంచి 0.43 శాతానికి దిగొచ్చాయి.

### యెస్ బ్యాంక్ 150 శాఖలు

ముంబై, అక్టోబర్ 21: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ.228.64 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది యెస్ బ్యాంక్. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.160.41 కోట్ల లాభంతో పోలిస్తే 47 శాతం అధికం. గత త్రైమాసికంలో స్థూల నిరర్థక ఆస్తుల విలువ 2.1 శాతానికి తగ్గగా, నికర ఎన్‌పీఏ 1.4 శాతానికి పరిమితమయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా 150 శాఖలను ప్రారంభించాలనుకుంటున్నట్లు బ్యాంక్ ఎండీ ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఇప్పటికే ఈ ఏడాది 20 శాఖలను ఆరంభించినట్టు చెప్పారు. ఈ సారి రుణ వితరణలో 15 శాతం వృద్ధి, డిపాజిట్లలో 18 శాతం అంచనావేస్తున్నట్టు తెలిపారు. సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.1,200 కోట్లు రుణాలు మొండి బకాయిల జాబితాలోకి చేరినట్టు చెప్పారు.

# మారుతి జిమ్నీపై లక్ష రాయితీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 21: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ.. ప్రత్యేక ఎస్‌యూవీ మాడల్ జిమ్నీపై లక్ష రూపాయల వరకు రాయితీని ఇస్తున్నట్టు ప్రకటించింది. జిమ్నీ ఎస్‌యూవీపై రూ.50 వేల వరకు రాయితీ ఇస్తున్న సంస్థ..ఎక్స్చేంజ్ లేదా లాయల్టీ బోనస్ కింద రూ.50 వేల వరకు డిస్కౌంట్ ఇస్తున్నది. ఈ ఆఫర్లు దేశవ్యాప్తంగా ఉన్న నెక్సా డీలర్ల వద్ద ఈ నెల చివరి వరకు మాత్రమే లభించనున్నదని తెలిపింది. ఈ ఆఫర్ మాన్యువల్, పెట్రోల్ రకం మాడళ్లకు వర్తించనున్నది. ప్రస్తుతం జెటా రకం రూ.12.74 లక్షల ప్రారంభ ధరతో లభించనున్నది.

### ఐడీబీఐ లాభం 1,323 కోట్లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 21: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను రూ.1,323 కోట్ల నికర లాభాన్ని గడించింది ఐడీబీఐ బ్యాంక్. మొండిబకాయిలు తగ్గుముఖం పట్టడంతో లాభంలో 60 శాతం వృద్ధి నమోదైందని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. 2022–23 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ.6,066 కోట్లుగా ఉన్న బ్యాంక్ ఆదాయం గత త్రైమాసికానికిగాను రూ.6,924 కోట్లకు చేరుకున్నట్టు వెల్లడించింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 16.51 శాతం నుంచి 4.90 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ 1.15 శాతం నుంచి 0.39 శాతానికి దిగొచ్చింది.









Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.